కాలు తొక్కినాడే ఇట్లుంటే?

కాపురం చేసే కళ.. కాలు తొక్కినాడే తెలుస్తది.. అనే పాత సామెత టీపీసీసీ చీఫ్ రేవంత్‌కు అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన నాటినుంచి ఆయన నోటికి, చేతలకు పగ్గాలు లేకుండా పోయాయి. చిన్నంతరం.. పెద్దంతరం.. పదవులు.. హోదాలు.. అనుభవం.. అస్తిత్వం.. దేన్నీ చూడకుండా ఎవరినిపడితే వారిని.. నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతూ హద్దుల్లేకుండా ప్రవర్తిస్తున్నాడు.

అన్నివర్గాలపైనా తన నోటి దురుసును ప్రదర్శిస్తున్నాడు. మూడు గంటల కరెంటే చాలని, రైతు సంక్షేమ పథకాలు ఆపేయాలని అటు అన్నదాతలను అవమానించిన రేవంత్.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకూ ధమ్కీ ఇస్తున్నాడు. తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన ఉస్మానియా వర్సిటీ విద్యార్థులను అడ్డా కూలీలని అవహేళన చేశాడు.

చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్‌పైనా బూతుపురాణం అందుకున్నాడు. మనకోసం ప్రాణాలకు తెగించి కొట్లాడిన ఉద్యమ నేత కేసీఆర్‌కు శిరచ్ఛేదనం చేస్తామంటూ దుర్మార్గంగా మాట్లాడాడు. తన సొంత పార్టీ కార్యకర్తలను బూటుకాలితో తన్నిన టీపీసీసీ చీఫ్.. హస్తం పార్టీ సీనియర్ నేతలపైనా దురహంకారం ప్రదర్శించి, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడు.

నగరంలో బంగారమోలె వ్యాపారం చేసుకుంటున్న వీధివ్యాపారులను నగరం బయటకు తరలిస్తామని అంటున్నాడు. అధికారంలోకి వస్తే రాచకొండలో రైతుల భూములు లాక్కొంటానని చెప్తున్నాడు. నగరంలో సొరంగాలు తవ్వుతామని, తెలంగాణ భవన్‌ను పేల్చేస్తానని విధ్వంసకర వ్యాఖ్యలతో రెచ్చిపోతున్నాడు.



రేవంత్ అహంకార వ్యాఖ్యలు

వ్యవసాయానికి 3 గంటల కరెంటే!

ఎకరం భూమికి నీళ్లు పారేందుకు గంట సమయం సరిపోతుంది. తెలంగాణలోని 58 లక్షల కమతాల్లో 95 శాతం చిన్న సన్నకారు రైతులవే. వీరంతా 3 ఎకరాలలోపు భూమి ఉన్నవాళ్లే. అంటే వ్యవసాయానికి 3 గంటల కరెంట్ ఇస్తే సరిపోతుంది.

-10 జూలై 2023

గుడ్డలిప్పదీసి కొడుతాం..

అధికారులను హెచ్చరిస్తున్నా.. రెడ్ డెయిరీలో పేర్లు రాసిపెడుతున్నాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకొక్కడిని గుడ్డలిప్పదీసి కొడతాం. అసలు, మిత్తితో చెల్లిస్తాం.

-16 ఆగస్టు 2023

కార్యకర్తలను కాలుతో తన్ని.. బూతులు తిట్టి..

పాలకుర్తి సభలో రేవంత్ తనను కలిసేందుకు వచ్చిన వారిని బూటుకాలితో తన్నాడు. సొంత పార్టీ కార్యకర్తలపై బూతు పురాణం అందుకున్నాడు. ఆ సభలో అరుస్తున్న కార్యకర్తలను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతూ.. 'పిచ్చి లేసిందా? తల తిరుగుతున్నదా?' అంటూ నోటికొచ్చిన బూతులు తిట్టాడు.

-9 నవంబర్ 2023

రైతుబంధు డబ్బులివ్వొద్దు..

'రైతుబంధు నిధులను ఆపేయండి. ఎన్నికల సమయంలో రైతులకు రైతుబంధు డబ్బులు ఇవ్వొద్దు. దీంతో పాటు దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి పథకాలను కూడా ఆపేయాలి. వీటన్నింటిని నెలపాటు వాయిదా వేయాలి' అంటూ రేవంత్ అక్కసు వెళ్లగక్కాడు.

-25 అక్టోబర్ 2023

పొన్నాల లక్ష్మయ్యకు ముసలితనంలో సిగ్గుండాలి

పొన్నాల లక్ష్మయ్య పార్టీ మారడంపై రేవంత్ స్పందిస్తూ.. 'ఈ వయసులో పార్టీ మారేందుకు సిగ్గుండాలి. సచ్చే ముందు ఏం రోగమొచ్చింది? ఆయనకు కాంగ్రెస్ పార్టీ అన్నీ ఇచ్చింది. పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే 40 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిండు. రెండోసారి ఇస్తే 50 వేల తేడాతో ఓడిపోయిండు. పార్టీ మారడమే బుద్ధిలేని పని' అంటూ రంకెలేశాడు.

-13 అక్టోబర్ 2023

జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెడతా

'డీజీపీ నుంచి డీఎస్పీ వరకు, కొన్ని చోట్ల సీఐలు కూడా అతిగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా ఐఏఎస్‌లు కూడా అతి చేస్తున్నారు. ఐఏఎస్‌లు మొదలుకొని ఎమ్మార్వో, ఎంపీడీవో వరకు అన్ని స్థాయిల అధికారుల పనితీరుపై నిఘా పెడుతున్నాం. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వార్తలు రాసిన టీవీలు, పేపర్లలోని రిపోర్టర్లు, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెడతాం' అంటూ బెదిరింపులకు దిగాడు.

-10 అక్టోబర్ 2023

రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలె

ఎకరం భూమికి నీళ్లు పారేందుకు గంట సమయం సరిపోతుంది. తెలంగాణలోని 58 లక్షల కమతాల్లో 95 శాతం చిన్న సన్నకారు రైతులవే. వీరంతా 3 ఎకరాలలోపు భూమి ఉన్నవాళ్లే. అంటే వ్యవసాయానికి 3 గంటల కరెంట్ ఇస్తే సరిపోతుంది. రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకొంటే 3 గంటల కరెంట్ సరిపోతుంది.

- 11 నవంబర్ 2023

సీఎం కేసీఆర్‌పై తిట్లపురాణం

మక్తల్, కామారెడ్డి సభలో సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారు. కేసీఆర్ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, ఆయన కుటుంబసభ్యులపై రాయలేని భాషలో బూతు పురాణం అందుకున్నాడు.

-7 నవంబర్ 2023, 10 నవంబర్ 2023

తెలంగాణ రాష్ట్రమే అక్కర్లేదు

'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అక్కర్లేదు. సమైక్యమే బాగుండేది. వలస పాలకులు తెలంగాణకు అన్నీ ఇచ్చింద్రు. నిధులు ఇచ్చారు, నీళ్లు ఇచ్చారు, ఉద్యోగాలిచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం సాగలేదు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ వీటిని కోరుకోలేదు' అంటూ రేవంత్ మాట్లాడాడు.

- 10 నవంబర్ 2023

కేసీఆర్‌కు శిరచ్ఛేదనం చేస్తా..

'పాపాలు పండాయ్.. శిశుపాలుడి వంద తప్పులు ముగిశాయి. ఇక కేసీఆర్ శిరచ్ఛేదనమే తరువాయి' అంటూ స్టేషన్‌ఘన్‌పూర్ సభలో రేవంత్ దుర్మార్గపు వ్యాఖ్యలు చేశాడు.

- నవంబర్ 15 2023

తెలంగాణ భవన్‌ను పేల్చేస్తా

'తెలంగాణ భవన్‌ను పేల్చేస్తా.. అందులో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులకు ప్రవేశం లేదు. కాంట్రాక్టర్లు, ఆంధ్ర పెత్తందార్లకే అనుమతి ఉంది' అంటూ జనగామ సభలో రేవంత్ సంచలన వ్యాఖ్యలు

- నవంబర్ 15 2023

వీధివ్యాపారులను నగరం బయటకు తరలిస్తా

అధికారంలోకి వస్తే రాచకొండలో రైతుల భూములు లాక్కుంటాం. అక్కడ 50 వేల ఎకరాలు సేకరిస్తాం. అమరావతి తరహాలో కొత్త నగరాన్ని నిర్మిస్తాం. నగరంలోని వీధివ్యాపారులందరినీ అక్కడికి తరలిస్తాం. -8 నవంబర్ 2023

దిల్‌సుఖ్‌నగర్ నుంచి జూబ్లీహిల్స్ వరకు సొరంగం తవ్వుతాం

రోడ్లు... ఫ్లైఓవర్లు అనేది ఒక లెవల్ టెక్నాలజీ. అంతకుమించి టన్నెల్ టెక్నాలజీ ఉంది. స్ట్రెయిట్ కనెక్టివిటీ లైన్. దిల్‌సుఖ్‌నగర్ నుంచి జూబ్లీహిల్స్ వరకు వెళ్లాలనుకున్నా! బహదూర్‌పుర నుంచి బాలానగర్ వరకు వెళ్లాలనుకున్నా!! అండర్ టన్నెల్ రోడ్డు ద్వారా స్ట్రెయిట్‌గా వెళ్లొచ్చు. బయటి రోడ్లు ఉన్నట్టు కాదు. టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో ఎంత రోడ్డు కావాలంటే అంత రోడ్డు వేసుకోవచ్చు. -3 నవంబర్ 2023

దివ్యాంగుల ఓట్లు కేసీఆర్‌కే

4 వేల పింఛన్ ఇస్తున్నడు ఆరు వేలకు పెంచుతడట.. మళ్లీ కేసీఆర్ సారే రావాలి: మక్క శేఖర్

ఆదిలాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ) : దివ్యాంగులకు రూ.4 వేల పింఛన్‌తో పాటు అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కార్ మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్టు ఓ దివ్యాంగుడు పేర్కొన్నాడు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దివ్యాంగుడు మక్క శేఖర్ తన తల్లి లక్ష్మితో కలిసి ప్రచారానికి వచ్చాడు. ఈ సందర్భంగా శేఖర్ ఎమ్మెల్యే వద్ద మైక్ తీసుకొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అందిస్తున్న పథకాలను వివరిస్తూ మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ఆకాంక్షించాడు. దివ్యాంగుడు మాట్లాడుగూ.. 'సీఎం కేసీఆర్ ఇస్తున్న పింఛన్ డబ్బులు మా అవసరాలు తీరడమే కాకుండా ఇతర ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. సర్కారు అందిస్తున్న సాయంతో నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ఇప్పుడు రూ.6 వేల పింఛన్ ఇస్తానని కేసీఆర్ సర్ అంటున్నరు. నాకు పది సంవత్సరాలుగా పింఛన్ వస్తున్నది. తల్లిదండ్రులు లక్ష్మి, నరేందర్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాకు పింఛన్ రాకపోతే ఇబ్బందులు పడేవాళ్లం. ఇంతకుముందు దివ్యాంగులను ఎవరూ పట్టించుకోలేదు. మా గురించి ఆలోచించి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్న కేసీఆర్‌కే మేం అండగా ఉంటాం' అని ప్రకటించాడు. కారు గుర్తుకు ఓటు వేసి జోగు రామన్నను మరోసారి గెలిపించుకుంటామని తెలిపాడు.

ఆదిలాబాద్ పట్టణం కేఆర్‌కే కాలనీకి ప్రచారం నిమిత్తం వచ్చిన ఎమ్మెల్యే జోగు రామన్నకు కేసీఆర్ సర్కార్ దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను వివరిస్తున్న మక్క శేఖర్

అది ఓటింగ్ డే.. హాలిడే కాదు!

- ప్రతి ఒక్కరు ఓటు వేయడానికి బయటికి రావాలి
- ఎన్నికల విధుల్లో 3 లక్షల మంది ఉద్యోగులు, పోలీసులు
- 10 వేల ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు
- 2.81 కోట్ల మందికి పోలింగ్ స్లిప్పుల పంపిణీ
- ఇప్పటికే ఇళ్ల వద్ద ఓటు వేసిన 14 వేల మంది ఓటర్లు
- ఓట్ల లెక్కింపునకు నియోజకవర్గానికో పరిశీలకుడు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎన్నికల పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించిందని.. అలాగని ప్రతి ఒక్కరు ఆ రోజును హాలిడే (సెలవు రోజు)గా కాకుండా ఓటింగ్ డే (ఓటు వేసే దినం)గా గుర్తించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతున్నదని, ఈసారి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి విధి, బాధ్యత అని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని తెలిపారు. బీఆర్‌కేఆర్ భవన్‌లో గురువారం ఆయన ఇతర అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఓటర్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, పోలీసులు సహా దాదాపు మూడు లక్షల మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 4,70,270 పోస్టల్ బ్యాలట్‌లను ప్రింట్ చేశామని, ఈవీఎంల కోసం 8,84,584 బ్యాలట్ పేపర్లను ముద్రించామని చెప్పారు. టెండర్ ఓటు, చాలెంజ్ ఓటు కోసం అదనంగా బ్యాలెట్ పేపర్లను ముద్రించామని తెలిపారు. 51 లక్షల ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇండ్లకు పంపించామని చెప్పారు.

ఓట్ల లెక్కింపునకు పరిశీలకులు

ఓట్ల లెక్కింపునకు ప్రతి నియోజకవర్గానికి ఒక పరిశీలకుడిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని వికాస్‌రాజ్ తెలిపారు. పరిశీలకుడి అనుమతితో ప్రతి రౌండ్ ఫలితాన్ని రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారని వివరించారు. ఈ ఎన్నికల్లో తొలిసారి హోం ఓటింగ్ విధానాన్ని అమలు చేశామని, ఇప్పటివరకు 14 వేల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని వికాస్‌రాజ్ తెలిపారు. ఇందులో 80 ఏండ్లు దాటినవారు 9,386 మంది, దివ్యాంగులు 5,022 మంది, అత్యవసర సర్వీసుల ఉద్యోగులు 253 మంది ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 2.81 కోట్ల (86%) మంది ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేశామని చెప్పారు. ఈవీఎంలు తీసుకవెళ్లే ప్రతి వాహనానికి జీపీఎస్‌ను అమర్చనున్నామని సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. ప్రైవేటు వాహనాల్లో ఈవీఎంలను తరలించడం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం సూచించిన వాహనాలు కాకుండా ఇతర వాహనాల్లో ఈవీఎంలను తరలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 వేల ఎఫ్ఐఆర్‌లు

రాష్ట్రంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై 10,106 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వికాస్‌రాజ్ తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అనుచరులపై 777 కేసులు నమోదయ్యాయని వివరించారు. ఇప్పటివరకు రూ.669 కోట్లను సీజ్ చేశామని చెప్పారు. ఇందులో రూ.260 కోట్ల నగదు, రూ.108 కోట్ల విలువైన మద్యం ఉందని తెలిపారు. బంగారం, ఇతర వస్తువులు రూ.183 కోట్లు, ఉచితాలు రూ. 81కోట్ల విలువైన బహుమతులు ఉన్నాయని తెలిపారు. రైతు బంధుపై ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అనుమతి కోరిందని, దానిపై ప్రభుత్వాన్ని వివరణ అడిగామని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.

బయాలజీ లేక నీట్ రాయని విద్యార్థులకు శుభవార్త

- అదనపు సబ్జెక్టుతో నీట్ యూజీకి హాజరుకావొచ్చు
- ఎన్ఎంసీ సర్క్యులర్‌లో వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : మీరు ఇంటర్‌ను బయాలజీ సబ్జెక్టు లేకుండా పూర్తిచేశారా.. నీట్ యూజీ రాయాలన్న.. డాక్టర్ కావాలన్న మీ కల నెరవేరలేదా.. అయితే నో టెన్షన్. ఇక నుంచి ఇంటర్‌లో బయాలజీ చదవని విద్యార్థులకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రత్యామ్నాయంగా మరో అవకాశం ఇచ్చింది. ఇలాంటి విద్యార్థులు అదనపు సబ్జెక్టుగా బయాలజీని చదివి.. నీట్ యూజీకి హాజరుకావొచ్చని నేషనల్ మెడికల్ కమిషన్ తెలిపింది. ఈ మేరకు గురువారం తన వెబ్‌సైట్‌లో సర్క్యులర్‌ను పొందుపరిచింది. ఇటీవలి కాలంలో 10 ప్లస్ టూ విద్యలో అనేక సబ్జెక్టు కాంబినేషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు బయోటెక్నాలజీ ఇతర సబ్జెక్టులను విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇలాంటి వారికి నీట్ యూజీ రాసేందుకు అవకాశం లేదు. దీంతో ఎంబీబీఎస్ చదువుకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా విద్యార్థుల కోసం ఎన్ఎంసీ ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నది. గతంలో తిరస్కరించిన నీట్ దరఖాస్తులకు ఇది వర్తిస్తుందని ఎన్ఎంసీ పేర్కొన్నది.

'కోర్' ఫ్యాకల్టీ బోధనకు అనుమతించండి

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ కోర్ బ్రాంచీలకు బోధిస్తున్న ఫ్యాకల్టీని ఇతర బ్రాంచీల బోధనకు అనుమతించాలని జేఎన్టీయూహెచ్‌ను అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ వంటి కోర్ బ్రాంచీలకు బోధించే ఫ్యాకల్టీని అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చైన్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్, డాటా సైన్సెస్, సైబర్ సెక్యూరిటీ, 3డీ ప్రింటింగ్, డిజైన్ వంటి కోర్సుల్లో బోధించేందుకు అనుమతించాలని ఆదేశాలిచ్చింది. ఈ మేరకు జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డికి ఏఐసీటీఈ సలహాదారు మమతా అగర్వాల్ లేఖ రాశారు. ఆయా కోర్సులకు బోధించాలంటే ఫ్యాకల్టీ.. స్వయం, ఎన్‌పీటీఎల్, మూక్స్ ద్వారా 10 క్రెడిట్స్ సొంతం చేసుకొని ఉండాలని సూచించారు.

పర్యవేక్షక ఇంజినీర్, పంచాయతీరాజ్ రీజనల్ కార్యాలయం, వరంగల్

నోటీస్

నెం. A1/917/202 తేది: 06-11-2023

1) శ్రీ ఎం. వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్, 2) శ్రీ డి. శంకరయ్య, అసిస్టెంట్ ఇంజినీర్, 3) శ్రీ సయ్యద్ ఫాహిద్దిన్, అసిస్టెంట్ ఇంజినీర్ గత (15) సంవత్సరముల నుండి ఎలాంటి సమాచారం లేకుండా ఉద్యోగమునకు హాజరుకావడము లేదు. వీరిపై సి.సి.ఏ. రూల్స్ ప్రకారము తేది: 08-12-2023 రోజున ఉదయం 11.00 గంటలకు కార్యాలయం నందు విచారణ జరుపుటకు నిర్ణయించనైనది. కావున అబ్సకాండింగ్ ఉద్యోగులు తప్పనిసరిగా విచారణ ముందు హాజరగుటకు కోరనైనది. లేనియెడల నిబంధనల ప్రకారము తగు చర్య తీసుకోబడును.

DIPR RO.No. 2169-DP/CL/ADVT/1/2023-24, Dt: 23-11-2023 సం/- పర్యవేక్షక ఇంజినీర్

ఆడిట్ ఉద్యోగుల రక్తదానం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఆడిట్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉద్యోగులు 81 యూనిట్ల రక్తదానం చేశారు. ఆడిట్ వీక్ సందర్భంగా గురువారం ఇక్కడి ఏజీ కాంప్లెక్స్ ప్రాంగణంలో హెల్త్‌క్యాంప్‌తో పాటు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యోగులకు ఫిట్‌నెస్ గురించి అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. శుక్రవారం చివరిరోజు కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో డీజీ ఎంఎస్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలోనూ బీఆర్ఎస్సే

- మా ప్రజలు కూడా కోరుకుంటున్నారు
- మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గె

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు హాజరైన మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గె

జహీరాబాద్, నవంబర్ 23: మహారాష్ట్రలోనూ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని తమ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ఆ రాష్ట్ర రైతు సంఘం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గె, ఆ రాష్ట్ర నాయకుడు సచిన్ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఎంతో అభివృద్ధి చేసిందని కొనియాడారు. మహారాష్ట్రలో ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కావాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నట్టు తెలిపారు. మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధిక స్థానాల్లో గెలుపొందినట్టు చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మంచి మెజార్టీతో గెలుపొంది మూడోసారి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.